క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



వరికుంటపాడు : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు సందిరెడ్డి మాలకొండ్రాయుడు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ చైర్మన్, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, జి.రామకృష్ణ కలిసి బాధితులకు రూ.10 వేల చొప్పున సాయం చేశారు.

ట్యాబ్‌ల పంపిణీ



కావలి : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌లను దగదర్తి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మేకపాటి పరామర్శ




వరికుంటపాడు : మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మేడసాని చెన్నయ్యను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి, యువనేత అభినవ్‌రెడ్డి బుధవారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. చెన్నయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా ఆయన అనారోగ్యానికి గల కారణాలు తెలుసుకుని మనోధైర్యం కల్పించారు. వారి వెంట జెడ్పీటీసీ ఆర్.నాగేంద్ర, పార్టీ నేత ఎం.తిరుపతినాయుడు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ల పంపిణీ



ఆత్మకూరురూరల్ : ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం వారు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 2024 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను బుధవారం పంపిణీ చేశారు. చెర్లోయడవల్లి, పేరారెడ్డిపల్లి, బండారుపల్లి తదితర పాఠశాలల్లో జరిగిన పంపిణీ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు చేరెడ్డి నరేంద్రరెడ్డి, నాయకులు రామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివరామిరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తలమంచి మేజర్ కెనాల్‌లో పూడికతీత



పూడికతీత పనులు చేయిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌నాయుడు

కావలి : దగదర్తి మండలంలోని తలమంచి మేజర్ కెనాల్‌లో పూడికతీత పనులను ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడు బుధవారం ప్రారంభించారు. మండలంలోని మబ్బుగుంటపాళెం, వెలుపోడు, దగదర్తి, తడకలూరు, ఊచగుంటపాళెం తదితర గ్రామాలకు సాగునీరు అందించే తలమంచి మేజర్ కెనాల్ పూడిపోయి ఉండటంతో కావలి కెనాల్ నుంచి సాగునీటి ప్రవాహానికి అవరోధంగా ఉంది. దీంతో రైతుల విజ్ఞప్తి మేరకు ఎంపీపీ ప్రసాద్‌నాయుడు తన సొంత నిధులు వెచ్చించి కాలువలో పూడిక తొలగించే పనులను ప్రారంభించారు.

డీజీపీని కలిసిన మర్రిపాడు జెడ్పీటీసీ



మర్రిపాడు : విజయవాడలో రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిని మర్రిపాడు జెడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు.

ఉల్లాసంగా ఆడుదాం

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఊరూ.. వాడా పండగ వాతావరణంలో జరుగుతోంది. పెద్ద ఎత్తున యువత ఉల్లాసంగా పోటీల్లో తలపడుతూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కూడా వివిధ గ్రామాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీల కోలాహలం నెలకొంది.

- గ్రామాల్లో క్రీడాపోటీల కోలాహలం

కలిగిరి : మండల కేంద్రమైన కలిగిరిలో బ్యాడ్మింటన్ పోటీలను జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి బుధవారం ప్రారంభించారు. గ్రామంలోని యువత ఉత్సాహంగా పోటీల్లో తలపడ్డారు. ఈ సందర్భంగా వారికి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు సౌకర్యాలు కల్పిస్తున్నారు.

హోరాహోరీగా..

చేజర్ల : మండల పరిధిలోని 15 సచివాలయాలకు సంబంధించి తొమ్మిది మైదానాల్లో ఆడుదాం ఆంధ్రా పోటీలు జరుగుతున్నాయి. 12 సచివాలయాలకు సంబంధించి వాలీబాల్‌కు 14 పురుషుల టీమ్‌లు, ఆరు మహిళల టీమ్‌లు పాల్గొన్నాయి. మూడు సచివాలయాల్లో 12 మంది పురుషులు, ఐదుగురు మహిళలు బ్యాడ్మింటన్ ఆడారు. చేజర్లలో బుధవారం జరిగిన వాలీబాల్ పోటీలను హైస్కూల్ హెచ్‌ఎం హైమావతి, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మల్లికర్జున పర్యవేక్షించారు.

కొరిమెర్లలో..

సంగం : మండలంలోని కొరిమెర్ల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ గోపి పలు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారు కొద్దిసేపు క్రికెట్ ఆడారు. యువకుల్లో క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కామిరెడ్డిపాడులో..

సోమశిల : అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడులో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలను శాప్ డైరెక్టర్ కాలువ నరసింహులు బుధవారం ప్రారంభించారు. ఇందులో గొరవరం, కామిరెడ్డిపాడు టీమ్‌లకు పోటీలు జరిగాయి. ఇందులో కామిరెడ్డిపాడు టీమ్ విజయం సాధించింది. కార్యక్రమంలో చంద్రశేఖర్‌నాయుడు, పెంచలయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణించాలి

మర్రిపాడు : 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో భాగంగా గ్రామీణ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆత్మకూరు ఆర్డీఓ మధులత అన్నారు. మండలంలోని నందవరం సచివాలయ పరిధిలో ఎంపీడీఓ మధులత, సర్పంచ్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ప్రారంభించిన పోటీలకు ఆర్డీఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు పలు సూచనలు చేశారు.

సత్తా చాటండి

ఆత్మకూరు : ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో సత్తా చాటాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎంపీడీఓ పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే క్రీడా పరికరాలు అందజేసి గ్రామీణ ప్రాంత క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో రాణించేలా కృషి చేస్తోందని వివరించారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీలు తిరుపతయ్య, శ్రీదేవి, సురేష్, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **ఆత్మకూరురూరల్ :** మండలంలోని చెర్లోయడవల్లి సచివాలయానికి సంబంధించిన క్రీడాకారులు మహిమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ప్రతిఒక్కరూ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పాల్గొన్నారు.



వరికుంటపాడు మండలం వేంపాడులో క్రికెట్ ఆడుతున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



సంగం : క్రికెట్ ఆడుతున్న ఎంపీడీఓ గోపి



సోమశిల : క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ నరసింహులు



కలిగిరి : బ్యాడ్మింటన్ ఆడుతున్న నాయకులు

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

వరికుంటపాడు : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేంపాడు సచివాలయ పరిధిలో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడాపోటీలను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులను గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చేలా సీఎం జగన్‌మోహన్ రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు అట్టహాసంగా జరుగుతోందన్నారు. ఈ పోటీలు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ యువ నేత మేకపాటి అభినవ్ రెడ్డి, ప్రత్యేకాధికారి తిరుపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ జి.వెంకటలక్ష్మమ్మ, జెడ్పీటీసీ ఆర్.నాగేంద్ర, జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు దాసరి ఎర్రాఓబయ్య, సొసైటీ అధ్యక్షుడు జి.రామాంజనేయులు, సొసైటీ డైరెక్టర్ జక్కం శ్రీనివాసులురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బి.వెంకటేశ్వర్లు, మాజీ ఏఎంసీ చైర్మన్ షేక్.అలీఅహ్మద్ పాల్గొన్నారు.



చేజర్ల : టీకేపాడు హైస్కూల్లో వాలీబాల్ ఆడుతున్న యువత



మర్రిపాడు : నందవరంలో..



కలిగిరిలో బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు



ఆత్మకూరురూరల్ : మహిమలూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీపీ

జనవరి 15లోపు నాట్లు వేసుకోవాలి

జలదంకి : మండల పరిధిలో చెరువులు, బావులు, బోర్లు, బోరు బావుల కింద నాటే రైతులు జనవరి 15లోపు వరినాట్లు వేసుకోవాలని ఏఓ బి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ తరువాత నాటుకుంటే వెన్నుతీసే సమయంలో అధిక ఎండల వల్ల గింజ సరిగ్గా రాక దిగుబడి తగ్గుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించి వరినాట్లు వేసుకోవాలని సూచించారు.

ఎస్వీపీఎం రైతుల్లో ఆందోళన

- కాలువలో తగ్గిన నీటి ప్రవాహం

బిట్రగుంట : బోగోలు మండలానికి సాగునీరందించే ఎస్వీపీఎం కాలువ షట్టర్లు దించేయడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. సోమశిల అధికారులు ముందస్తు సమాచారం లేకుండా మంగళవారం రాత్రి షట్టర్లు దించేయడంతో కాలువలో నీటి ప్రవాహం తగ్గిపోయింది. బోగోలు పంచాయతీ కార్యాలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆయకట్టు రైతులు, సోమశిల అధికారులతో మంగళవారం సాయంత్రమే సమన్వయ సమావేశం నిర్వహించారు. పంట కాలం పూర్తయ్యే వరకూ నీరు విడుదల చేయాలని, పంట కాలువల్లో పూడికతీతపై నిర్ణయం తీసుకున్నారు. అయితే సమావేశం పూర్తయిన కొద్ది గంటల్లోనే అధికారులు ఎస్వీపీఎం షట్టర్లు దించేసి నీటి విడుదలను తగ్గించారు. ఈ విషయాన్ని బుధవారం ఉదయం గుర్తించిన రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు సోమశిల అధికారుల తీరుపై మండిపడ్డారు. సోమశిల అధికారులు తీరు మార్చుకోకుంటే ఎస్ఈ కార్యాలయం ముట్టడికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూరురూరల్ : ఆత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో పారిశుద్ధ్యం, సాగునీటి సరఫరా, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ, పంచాయతీరాజ్, ఉపాధిహామీ, ఐసీడీఎస్, విద్యుత్, తదితర ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహిస్తామన్నారు.

సంగమేశ్వరునికి అన్నాభిషేకం

సంగం : త్రివేణి సంగమం ఒడ్డున వెలసిన సంగమేశ్వరునికి అన్నాభిషేకం బుధవారం వైభవంగా నిర్వహించారు. శివముక్కోటి సందర్భంగా తొలుత వేద పండితులు ఆలయంలో సంగమేశ్వరునికి అన్నాభిషేకం చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉన్న పాతాళ శివలింగానికి సైతం అన్నంతో అభిషేకం గావించారు. మధ్యాహ్నం అభిషేకం చేసిన అన్నాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి పెన్నానదిలో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కంటాబత్తిన శ్రీహరిరెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



పాతాళ శివలింగానికి అన్నాభిషేకం

అభివృద్ధిపై దృష్టి సారించండి

- ఎంపీపీ పద్మజారెడ్డి
- అధికారుల గైర్హాజరుపై అసహనం

అనుమసముద్రంపేట : గ్రామాల అభివృద్ధిపై మండలస్థాయి అధికారులు దృష్టి సారించాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి తెలిపారు. ఏఎస్‌పేట ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అన్నిశాఖల అధికారులతో మాట్లాడారు. కొన్నిశాఖల అధికారులు గైర్హాజరు కావడంపై అసహనం వ్యక్తం చేశారు. గత సర్వసభ్య సమావేశంలో రోడ్ల మరమ్మతులు చేస్తామని హామీ ఇచ్చిన ఆర్‌అండ్‌బీ ఏఈ ప్రస్తుతం గైర్హాజరు కావడంతో ప్రజాప్రతినిధులు సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిసారి వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను సమావేశాలకు పంపుతూ ఏఈ రాకపోవడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓను కోరారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, దోమల నివారణ, తాగునీటి సమస్యలు లేకుండా చేయాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలను కోరారు. అంతేకాక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో గత మూడు నెలల నుంచి నాలుగు వేల మందికి వైద్యసేవలు అందించినట్లు డాక్టర్ మంజుల తెలిపారు. మండలంలోని అన్ని చెరువుల కింద దాదాపు 9,596 ఎకరాల్లో అధికారికంగా రైతులు సేద్యం చేస్తున్నారని, రబీ సీజన్‌లో వీరందరికీ కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉంచినట్లు వ్యవసాయాధికారిణి రజనీ తెలిపారు. ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎంపీడీఓ భాస్కర్ కోరారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి

కర సేవకులకు సన్మానం



ఆత్మకూరు : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో 1990–92 సంవత్సరాల్లో కరసేవలో పాల్గొన్న పలువురిని పట్టణంలోని పంటవీధి రామమందిరంలో బుధవారం ఘనంగా సన్మానించారు. వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్, పలు హైందవ సంఘాల ఆధ్వర్యంలో ఆత్మకూరుకు చెందిన 30 మందికిపైగా కరసేవలో పాల్గొన్న వారిని సత్కరించారు. అప్పటి వారి అనుభవాలను కరసేవకులు వివరించారు. అర్చకులు రామయ్యస్వామి, నాగరాజశర్మ కరసేవకులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, కార్యకర్తలు కుడుముల సుధాకర్‌రెడ్డి, కంది మల్లికార్జునరెడ్డి, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, శంకర్, భాస్కర్‌రెడ్డి, పెళ్లూరు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కూలీగా..

- ఆదర్శంగా నిలిచిన కౌన్సిలర్ వేణు



సిమెంటు రోడ్డు పనుల్లో బిజీగా కౌన్సిలర్

ఆత్మకూరు : పట్టణంలోని 18వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ గంధళ్ల వేణు తన పరిధిలో అభివృద్ధి పనుల కోసం కూలీగా మారి ఆదర్శంగా నిలిచారు. పూర్తి గిరిజన కుటుంబాలతో నిండి ఉన్న ప్రాంతంలో సిమెంటు రోడ్లు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణంలో భాగంగా తోటి కూలీలతో కలిసి పనులు చేపట్టాడు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ తన వార్డులో సిమెంటు రోడ్డు, కాలువ నిర్మాణ పనులు పూర్తయ్యేంత వరకు దగ్గరుండి పర్యవేక్షణ చేస్తానని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంట్రాక్టర్‌కు సూచించినట్లు తెలిపారు.

గ్రామాల్లో 'వికసిత్ భారత్'

చేజర్ల : మండలంలోని ఏటూరు, నూతక్కివారికండ్రిగ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మండలాధికారులు మాట్లాడారు. పీఎం కిసాన్, భూసార పరీక్షలు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, విశ్వకర్మ యోజన పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కరిముల్లా, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సుజీవన, వైద్యులు నవీన్, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట : గ్రామీణ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని కప్పరాళ్లతిప్పలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలను ఎమ్మెల్యే రామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. క్రీడారంగానికి పెద్దపీట వేసి క్రీడాకారులకు వసతులు కల్పించడం, పాఠశాల స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి కల్పించడం, తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు, మండల యువత అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

సీతారామపురం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఏడుగురు మహనీయుల విగ్రహ నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. నిర్మాణ పనులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఎస్‌ఎఫ్‌డీ సంస్థ చైర్మన్ కలివెల ఎలీషాకుమార్, జెడ్పీటీసీ రమణారెడ్డి, యువ నేత మేకపాటి అభినవ్‌రెడ్డి, సర్పంచ్ దుర్గాప్రసాద్, తహసీల్దార్ సుధాకర్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ వినూత్న ధర్నా

ఆత్మకూరు : ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పట్టణంలో మూడు మండలాల యూటీఎఫ్ ఉపాధ్యాయులు బుధవారం సాయంత్రం వినూత్న ధర్నా చేపట్టారు. పాఠశాలల్లో విధులు నిర్వహించిన అనంతరం ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాల ఉపాధ్యాయులు యూటీఎఫ్ కార్యాలయానికి చేరుకున్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి బీఎస్సార్ సెంటర్ వద్ద రోడ్డు పక్కన బైఠాయించారు. యూటీఎఫ్ నేతలు పి.శివప్రసాద్, ఎం.గంగాధర్, మహిళా నేతలు ఎస్వీ ప్రసూన, కవితారాణి, అనిత, వరప్రసాద్, సుధాకర్, సుబ్బయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దీక్ష

ఆత్మకూరు : మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరాహార దీక్ష చేపట్టారు. రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం పిలుపు మేరకు సమ్మె నిర్వహిస్తున్నట్లు స్థానిక యూనియన్ నేతలు పేర్కొన్నారు. గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు సూచనలు పాటించాలి

కలిగిరి: పొగాకు చేసే రైతులు పొగాకు బోర్డు అధికారుల సూచనలతో ఆధునిక యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆ బోర్డు రీజినల్ మేనేజర్ లక్ష్మణరావు తెలిపారు. కలిగిరి పొగాకు వేలం కేంద్రం పరిధిలోని కొమ్మి, పార్లపల్లి, అగ్రహారం గ్రామాల్లోని తోటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా అధిక వర్షం కురిసి మొక్కల వేర్లకు సరిగ్గా ఆక్సిజన్ అందలేదన్నారు. ఎరువులు కూడా వర్షపునీటితో పొలం బయటకు వెళ్లి మొక్కల్లో పెరుగుదల తగ్గిందన్నారు. సీటీఆర్ఐ శాస్త్రవేత్త అనురాధ మాట్లాడుతూ పొగాకు తోటల్లో అంతర సేద్యం చేయాలన్నారు. లద్దె పురుగు లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, రైతు సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్‌బాబు, రైతులు పాల్గొన్నారు.



పొగాకు తోటలను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

లెప్రసీ సర్వే ప్రారంభం



ఆత్మకూరురూరల్ : కుష్టు నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి



వరికుంటపాడు : సర్వే నిర్వహిస్తున్న ఆశా కార్యకర్త

ఆత్మకూరురూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో లెప్రసీ సర్వే బుధవారం ప్రారంభించారు. మహిమలూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ దేవానంద్, డాక్టర్ అనూషాకుమారి ఆధ్వర్యంలో ఆశా వలంటీర్లు, వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి కుష్టువ్యాధి లక్షణాలు గల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కుష్టువ్యాధి నిర్ధారణ అయిన వారికి సకాలంలో మందులు అందజేసి చికిత్స చేస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పక్కాగా నిర్వహించాలి

ఉదయగిరి : మండల పరిధిలో జరుగుతున్న కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను పక్కాగా నిర్వహించాలని మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన పేర్కొన్నారు. ఆమె బుధవారం ఉదయగిరి పట్టణంలో జరుగుతున్న సర్వేను తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు చేశారు. రోజుకు 30 గృహాలను సందర్శించి స్పర్శలేని, రాగి మచ్చలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివకుమారి, పర్యవేక్షకులు చెన్నయ్య, రజినమ్మ పాల్గొన్నారు.

బాధ్యతగా చేపట్టాలి

వరికుంటపాడు : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, వలంటీర్లు కలిసి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వేను బాధ్యతగా చేపట్టాలని వైద్యాధికారులు ఆయేషా, కరీష్మా పేర్కొన్నారు. మండలంలో జరుగుతున్న సర్వేను వారు బుధవారం పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. సర్వే సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు పాల్గొన్నారు.

సోమశిల, లింగంగుంటలో..

సోమశిల : అనంతసాగరం మండలంలోని సోమశిల, లింగంగుంట గ్రామాల్లో వైద్యసిబ్బంది ఫైలేరియా సర్వే నిర్వహించింది. ఈ సందర్భంగా సోమశిల గ్రామంలో 300 మంది, లింగంగుంటలో 300 మంది రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో తనంతసాగరం పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు.



ఉదయగిరి : సర్వేను పరిశీలిస్తున్న శివకల్పన



సోమశిల : రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది